బిఎస్‌పి జిల్లా కార్యదర్శిగా సహదేవ

నియామక పత్రాలను అందజేస్తున్న గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శిగా కె.సహదేవ, మదనపల్లి అసెంబ్లీ అధ్యక్షులుగా కురవంకర రమణను నియమించామని రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేసి కమిటీలు నిర్మాణం చేసి పార్టీని అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించిన బందెల గౌతమ్ కుమార్‌కు సహదేవ, రమణ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు శ్యాంసుందర్, బాలాజీ, గంగాధర్, అరుణ్, లక్ష్మీపతి, శివ, శీను, అన్సర్ పాల్గొన్నారు.

దుర్ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

- కార్మికుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి
- పెట్రోల్ బంక్ ఎదుట ధర్నాలో సిపిఎం నాయకులు

పెట్రోల్ బంక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలో బషీర్‌ఖాన్ పెట్రోల్ బంకులో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు ముగ్గురు కార్మికులు చనిపోయిన దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రమాదానికి కారణమైన బషీర్‌ఖాన్ పెట్రోలు బంక్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం, పెట్రోల్ బంకు నడుపుతున్న బషీర్‌ఖాన్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన బషీర్‌ఖాన్ పెట్రోలు పంపు యాజమాన్యాన్ని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలు పంపులో ట్యాంక్ అండర్ గ్రౌండ్‌లో ఉందని దాన్ని క్లీన్ చేయాలని ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా, అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారుల అనుమతి లేకుండా యాజమాన్యాల నిర్లక్ష్య ఫలితంగా ముగ్గురు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంత దుర్ఘటన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో జరిగితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేసి, వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్రంగా విచారణ జరపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయచోటిలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే కేసును నీరుగార్చే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికుల కుటుంబాలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సిపిఎం ఆధ్వర్యంలో అన్ని రంగాల, సంఘాల ప్రాణాలను సమీకరించి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, నాయకులు బసిరెడ్డి, రామచంద్ర, రెడ్డయ్య, సురేంద్రబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆప్కోకు పూర్వ వైభవం తథ్యం

- జూన్ నుంచి 75 శాతం డిస్కౌంట్
- వంద శాతం సరుకు కొనుగోలుకు ఆదేశాలు
- సొసైటీ కార్మికుల మృతికి పరిహారం చెల్లిస్తాం
- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆప్కో పూర్వవైభవాన్ని సంతరించుకోవడం తథ్యమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పేర్కొన్నారు. సోమవారం ఆయన కడప, అన్నమయ్య జిల్లాల ఎడిలు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలు ఆర్థికాభివృద్ధిని సంతరించుకునేలా, చేనేతల ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చూశామన్నారు. ఫలితంగా ఆప్కో కార్మికుల ఉపాధి, అవకాశాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 2022 డిసెంబర్ నాటికి పాత బకాయిలన్నింటినీ క్లియర్ చేశామన్నారు. సొసైటీల నిల్వలన్నింటినీ వంద శాతం కొనుగోలు చేశామని తెలిపారు. మొదటి విడత కింద రూ.48 లక్షల స్టాకును తీసుకున్నామన్నారు. కోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో బకాయిలను చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం ఆప్కో దగ్గర రూ.50 లక్షల విలువ కలిగిన సరుకు నిల్వ ఉందన్నారు. 2013 నుంచి 2017 సంవత్సరాలకు చెందిన సరుకు అధిక శాతం డిస్కౌంట్ పెట్టామని చెప్పారు. జూన్ నుంచి 75 శాతం డిస్కౌంట్ అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్‌స్టాల్‌మెంట్స్ ఉంటామ యన్నారు. బయటి వ్యక్తులు సరైన పత్రాలను సమర్పిస్తే 12 నెలలపాటు డిస్కౌంట్ ఇచ్చే అవ కాశాలు ఉన్నాయని చెప్పారు. స్టాక్‌ను వేగంగా విక్రయించడం, టర్నోవర్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సొసైటీ కార్మికులు అనారోగ్య కారణాలతో మృతి చెందితే రూ.25 వేల నుంచి పరిహారం చెల్లించే పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో 100 మందికి చెక్కులు అందించానని తెలిపారు. రాయలసీమలో తక్కువగా ఉన్నాయని చెప్పారు. రూ.2.5 కోట్ల ఎన్‌హెచ్‌డిసి బకాయిలు చెల్లించామన్నారు. తొమ్మిదేళ్లుగా చేనేత కార్మికుల వేతనాలు పెంచలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలోని చేనేత విక్రయశాలలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చుతున్నామని తెలిపారు. ఆప్కో ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంగళగిరిలోని 3.5 ఎకరాల చేనేత స్థల ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. చేనేత రంగానికి విశేష కృషి చేసిన మహనీయులు విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జులై నుంచి సేల్స్‌మెన్ వేతనాలను పెరుగుతాయని చెప్పారు. నేత న్ననేస్తం కింద అందించే రూ.24 వేలతోరా మెటీరియల్ కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య ఎడిలు భీమయ్య, శ్రీనివాసరెడ్డి, ఎడిఓలు శేషగిరి, రవి, అహ్మద్, కిరణ్‌కుమారి, వనిత, డిఒలు కృష్ణ, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేష్, సొసైటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించండి : కలెక్టర్

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గిరీష తోపాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో అర్జీ నాణ్యతగా పరిష్కరించడం, సరైన విధంగా అర్జీదారునికి ఎండార్స్మెంట్ చేసే విధానంలో సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని శాఖాధికారులకు సూచించారు. హెచ్ఒడి లాగిన్‌లో ఆ శాఖకు సంబంధించి అప్లోడ్ చేసే అన్ని దరఖాస్తులు కనపడాలని ఒకవేళ అందులో ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్ ఎఒను కలిసి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని శాఖాధికారులు పారదర్శకంగా బదిలీలను చేపట్టాలన్నారు. ఏదేని శాఖలో ఎవరైనా బదిలీ కోరుకున్నప్పుడు నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో సిబ్బంది కొరత రాకుండా అదే క్యాడర్‌కు సంబంధించి సమర్థత కలిగిన వ్యక్తి ఈ జిల్లాకు బదిలీపై వస్తేనే బదిలీ కోరుకున్న వ్యక్తిని రిలీవ్ చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.

కార్మికులకు వేతనాలిచ్చి ఆదుకోవాలి

ధర్నాలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు

కలెక్టరేట్ ఎదుట గడ్డితింటూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ పంచాయతీ కార్మికులకు 3-5 నెలలు, స్వచ్ఛ భారత కార్మికులకు 8-14 నెలల జీతం రాక పోవడంతో గడ్డి తిని బతికే పరిస్థితి ఉందని ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల, స్వచ్ఛభారత కార్మికుల సంఘం (సిఐటియు అనుబంధం) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.రామాంజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సురేంద్ర బాబు పేర్కొన్నారు. కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు, స్వచ్ఛ భారత్ కార్మికులకు ఇచ్చే రూ. 10 వేల జీతం కూడా నెలల తరబడి ఇవ్వకుండా అధికారులు, పాలకులు వేధించడం సరైంది కాదని వాపోయారు. కరోనా కష్టకాలంలో పారిశుధ్య కార్మికులను యోధులు అని, నేడు వారి చేసిన పనికి జీతాలివ్వకుండా పస్తులు పెడుతున్నారని వాపోయారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా లేక జనరల్ ఫండ్ ద్వారా జీతాలివ్వాలన్న ఆదేశాలను తుంగలో తొక్కడం ఆనవాయితీగా మారందని వాపోయారు. చాలా మంది పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలన్నారు. వేతనాలు బ్యాంకుల ద్వారా కాకుండా చేతికిజీతం ఇస్తున్నారని, ఇదేమని అడిగితే పనికి రావొద్దని పాలకులు బెదిరిస్తున్నారని వాపోయారు. జీతాలు రాకపోతవడంతో అప్పులు తీవ్రం అయ్యాయని తెలిపారు. రాజకీయ వేధింపులు నివారించాలని, 15వ ఆర్థిక సంఘ నిధుల్లో పెండింగ్ జీతాలివ్వాలని నిబంధనలు చెబుతున్నా పాలకుల వివక్ష, అధికారుల నిర్లక్ష్యంతో కార్మిక కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంత వేలం పాట, చెత్త ఇంటి పన్ను నీటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం లో 50శాతం కార్మికులకు జీతాలివ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికుల సంఘం జిల్లా నాయకులు వెంకటరమణ, రెడ్డెయ్య, రామాంజులు, నారాయణమ్మ , శీను, నటరాజ్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌బికెలో ఎరువులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎపి సీడ్స్ ఎమ్‌డి శేఖర్‌బాబు

ఆర్‌బికెలో ఎపి సీడ్స్ ఎమ్‌డి తనిఖీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర ఎపి సీడ్స్ ఎమ్‌డి శేఖర్ బాబు తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సిద్ధంగా ఉంచిన వేరుశనగ కాయల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. జీలుగ విత్తన పంపిణీని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచనలు ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా విత్తన ఎపి సీడ్స్ ఎమ్‌డి జగదీష్, మండల వ్యవసాయాధికారి వై.నాగమణి, రైతు భరోసా సిబ్బంది చంద్రకళ పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా మేనిఫెస్టో : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

యువతకు ప్రతి ఏటా ఉద్యోగాల కల్పనతో పాటు నిరుద్యోగ భృతి అందించడమే కాకుండా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మహానాడులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో ప్రవేశ పెట్టారని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు బాదుడే బాదుడు కార్యక్రమం, మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్ళినప్పుడు ప్రజల నుండి వచ్చిన ఎన్నో రకాల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మహానాడు సందర్భంగా టిడిపి మేనిఫెస్టో తయారుచేసి ప్రకటించారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరి చదువు బాధ్యత తనదే అని చెప్పి అధికారంలోకి వచ్చాక కేవలం ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి పేరుతో రూ.15 వేలు మొదట్లో ఇచ్చి ఆ తర్వాత రూ.13,500 కుదించారని ఆరోపించారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడమే కాకుండా సరైన సమయంలో రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలతో పంట అంతా పొలాల్లోనే తడిసి ముద్దవుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారున్నారు. మహిళల పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని,గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో ఇంట్లో ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితులన్నీ దృష్టిలో పెట్టుకొని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా అన్ని వర్గాల సంక్షేమం కోసం మేనిఫెస్టో తయారుచేసి ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర బాష, గాలివీడు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యారెడ్డి,పెమ్మాడపల్లె సర్పంచ్ పల్లపు వాసు, గుర్రం సుబ్బయ్య నాయుడు, మాజీ సర్పంచ్ బసయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

'షుగర్, బిపి రోగులకు తరచూ వైద్య పరీక్షలు చేయాలి'

ప్రజాశక్తి- రాయచోటి

ఎన్‌సిడిసిడి సర్వే వంద శాతం పూర్తి చేయాలని, షుగర్, బిపి రోగులకు తరచూ వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ గిరీష వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి ఎన్‌సిడిసిడి సర్వే, డయాబెటిస్, హైపర్ టెన్షన్, అనీమియా తదితర అంశాలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనీమియా రోగులకు ఎప్పటికప్పుడూ రక్త పరీక్షలు నిర్వహించి వారిలో రక్తం మెరుగుదలకు కృషి చేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణపై ఎఎన్ఎం లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఆస్పత్రుల్లో రోగులకు సరైన వైద్యం అందిస్తున్నాం,ా లేదా రోగుల ద్వారా ఫీడ్‌బ్యాకర్ ఎఎన్ఎంలు ఇవ్వాలని సూచించారు. ఎన్‌సిడి - సిడి సర్వేపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో 70 శాతం తక్కువగా ఉన్న ఎఎన్ఎంలకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డిఎంహెచ్ఒకు సూచించారు. నిర్ణయించిన తేదీ కల్లా టార్గెట్ అచీవ్ కావాలని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో జనరల్ ఓపి సంఖ్యను మరింత పెంచాలన్నారు. సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పక్కగా అమలు చేసి ఇంటి వద్దకు వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించి వైద్యాధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణా తరగతులు

రాయచోటి: రాష్టం లోని నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉద్యోగ ఉపాధి కల్పన నిమిత్తం స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసిందని ఎపి రాష్ట్ర నైపుణ్య సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగానే రాజంపేట నియోజకవర్గంలో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసి అందులో జూనియర్ సాఫ్ట్ వేర్ కోర్సుపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9603770097లో సంప్రదించాలన్నారు.

దోమల నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కొండయ్య

దోమల అంతమే మన లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

దోమలు అంటు వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతాయని వాటి అంతమే మన లక్ష్యం కావాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. సోమవారం పీలేరు పట్టణ మోడల్ కాలనీలో ఆరోగ్య బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ దోమల నిర్మూలనకు మనమంతా హెచ్చు స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలని, ఇండ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇండ్లలోని నీటిపై విధిగా మూతలు పెట్టాలని చెప్పారు. అలాగే పరిసరాల్లో చెత్త, చెదారం చేరకుండా జాగ్రత వహిస్తే దోమ వృద్ధిని అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని, వాటిని నిర్మూలించుకుంటే అందరం ఆరోగ్యంగా జీవించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎం లక్ష్మీ, వెంకటరత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

మా భూములు సర్వే చేసి చూపించండి

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్న హయాంలో తమకు కేటాయించిన భూములను సర్వే చేసి ఎక్కడున్నాయో చూపించాలని ఓబులవారిపల్లి మండలానికి చెందిన చిన్న ఓరంపాడు కమ్మపల్లి హరిజనవాడ, జ్ఞానంపల్లి హరిజనవాడ, జ్ఞానంపల్లి అరుంధతి వాడకు చెందిన ప్రజలు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ భాస్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ 2005వ సంవత్సరం ఆగస్టు 17వ తేదీన అసైన్‌మెంట్ కమిటీ ద్వారా 140 మంది దళితులకు పట్టాలిచ్చి వాటికి సంబంధించిన భూమి సరిహద్దులను నేటికీ చూపించలేదని వాపోయారు. 18 ఏళ్లుగా తమ పట్టాలకు సంబంధించిన భూములను చూపించాలని ఓబులవారిపల్లె తహశీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా రెవెన్యూ వారు పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. జెడ్‌హెచ్‌డిసి కాలనీ, కొర్లకుంట దళితవాడకు చెందిన పండుగోల మణి, ఎస్.నరసింహులు రాజకీయ నాయకుల అండదండలతో దళితుల భూములు ఆక్రమించుకొని దర్జాగా కబ్జా చేసి అనుభవిస్తున్నారని, ఆ భూముల పక్కనే హైవే రహదారి వస్తుండడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయని పేర్కొన్నారు. రెవెన్యూ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి 2005లో తమకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కేటాయించిన భూములకు సరిహద్దులు చూపించి, ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లె మాజీ ఎంపిపి పి.తిరుపాలు, బొమ్మ శాంతీశ్వరరావు, రవి ప్రేమ్, బొమ్మ బసవయ్య, ఎం.వరకుమార్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సత్కరించిన ఆటో కార్మికులు

పీలేరు: తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.ధనుంజయులును బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బోదేషావల్లి ఆధ్వర్యంలో సోమవారం తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, దుశ్శాలువా, పూలమాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షులు షఫివుల్లా, ఉపాధ్యక్షులు కెవి సుబ్బారావు, సభ్యులు నౌలక్, సైఫుల్లా, రాజేంద్రబాబు, మణి, శీను, వెంకటేష్, బొడ్డు శీను, పాండు, అల్లాబక్షు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు

రాష్ట్రానికి బిజెపి ఒక శనిగ్రహం : పిసిసి

తులసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

కేంద్ర, రాష్ట్రాలకు బిజెపి ప్రభుత్వం ఒక శనిగ్రహం లాంటిదని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరులో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామంలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేరని ద్రోహం మోసం చేసిందన్నారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టి కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తిపలికిందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతుందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర సరుకులు సామాన్యునికి అందుబాటులో లేవన్నారు. దేశంలో బిజెపి కక్ష రాజకీయాలు ఎక్కువ చేస్తున్నరని ప్రజలకు అచ్చేదిన్ బదులు చచ్చేదిన్ దాపరిస్తున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలకు ప్రత్యేక హోదా ఇచ్చే శక్తి బిజెపి ప్రభుత్వానికి లేదని విభజన చట్టంలోని ఏ అంశాన్ని కూడా అమలు చేసే శక్తి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం పట్ల రైతులు రగిలిపోతున్నారని. మహిళలు, ఉద్యోగులు ఉడికిపోతున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌లో 40 కుటుంబాలు చేరిక

మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగానేరులో తులసిరెడ్డి, రాయచోటి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అల్లా ప్రకాష్ ఆధ్వర్యంలో వైసిపి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 40 కుటుంబాలు చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మండలం బిసి కాంగ్రెస్ నాయకుడు గుత్తి మారి వెంకటేశ్వర్లు. మండల అధ్యక్షులు మైసూరారెడ్డి, నరేష్, వెంకటరమణ, ప్రసాద్, రామచంద్ర, నిర్మల, కృష్ణయ్య, అశోక్, శీను, వెంకటరమణ, మల్లికార్జున, చిన్న సుబ్బయ్య, మంజుల, వెంకటరమణ, సుబ్బయ్య, ముస్లిం సోదరులు మరో పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జంకరయ్య, నజీర్ అహ్మద్, సుల్తాన్, గౌస్, శ్రీనివాసులు, ఖాదరవల్లి, ఖాదర్, నాగరాజు, రవణమ్మ, లతా, బేబీ, నరసింహారెడ్డి, అమీర్, ఉతన్న, షేక్ రఫీ, వేణుగోపాల్, మంజునాథ్, చిన్నకృష్ణ, ఖదీర్ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన అఖిలపక్ష నాయకులు

తప్పుడు కేసులకు భయపడేది లేదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి ప్రభుత్వం బనాయించే అక్రమ కేసులకు భయపడేది లేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. మదనపల్లి జిల్లా సాధన కోసం జెఎసి ఆధ్వర్యంలో తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోటలో జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా మదనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ తోపాటు 22 మందిపై తప్పుడు కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కేసులో భాగంగా సోమవారం మదనపల్లి కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి ఉండాల్సిన అర్హతలున్న మదనపల్లికి ఉన్నా కూడా జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. 2024 లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు, లోకేష్ మదనపల్లెని జిల్లాగా ఏర్పాటు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అనంతరం జనసేన నాయకులు గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లి నియోజకవర్గాల ప్రజాభీష్టం మేరకు మదనపల్లి జిల్లాను ఏర్పాటు చేయవలసిన నాయకులే కేసులు బనాయించడం శోచనీయమన్నారు. టిడిపి బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మదనపల్లి జిల్లా చేయకపోగాపైగా కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజాభీష్టం మేరకు పరిపాలన చేయాలి లేనిపక్షంలో ప్రజలే బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. కార్యక్రమంలో చెక్కెలా బాబు వెంకటేశ్వర్లు, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎంఎన్.చంద్రారెడ్డి, బాస్ పిటిఎం శివప్రసాద్, నూర్ అహ్మద్, గట్టు దంద్ర, డి.నారాయణ పాల్గొన్నారు.

ఉచిత హామీలతో ప్రజలను వంచించకండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉచిత హామీలతో ప్రజలను వంచించకుండా వారి మెరుగైన జీవనానికి అవసరమయ్యే దారితెన్నులు చూపించాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచించడం, భ్రమలో బ్రతికేలా చేయడం తప్ప ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చిన పాపాన పోలేదని అన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గుప్పించిన హామీలను అర చేతిలో వైకుంఠం చూపేలా ఉన్నాయని అన్నారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, కూడు, గూడు అందించి పరిశ్రమలు తీసుకొచ్చి తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపాలే కానీ.. కేవలం నిరుద్యోగ భృతి తోటి వారి జీవితాలు గడవవని తెలిపారు. ప్రజలు మోసపూరిత ఉచిత హామీలకు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని.. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చనుందని, ప్రజలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-సుండుపల్లి

వైస్ ఎంపిపి రెడ్డప్ప

మండలంలోని రాయవరం గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వైస్ ఎంపిపి కరిగిసెల రెడ్డప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయవరంలో స్థానిక ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని గమనించి అవసరమైన చోట నీటి మోటార్లను వేయించినట్లు తెలిపారు. కొన్ని గ్రామాలకు ట్యాంకర్లద్వారా ప్రజల దాహార్తి తీర్చామన్నారు. తన సేవలను గుర్తించి మండల ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారని పేర్కొన్నారు. రాయవరం గ్రామంలో పేద ప్రజల కోసం తన సొంత నిధులతో ఖర్చు చేసి ఎంతోమందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. పండగలకు పేద ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడు తున్న గ్రామాల్లో నీళ్ల ట్యాంకులు, పైపులైను వంటి సమస్యలను తీరుస్తామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన పింఛను దారి వృద్ధులు, వికలాంగులు, వితంతువులను గుర్తించి వారికి పింఛను అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరల సిఎం జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

ఇందిరమ్మ కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో వాటర్ ప్లాంట్‌ను ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహాయ సహకారాలతో జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వి.హరి, కార్య నిర్వాహక ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను నిర్మించినట్లు తెలిపారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మినరల్ ప్లాంట్ ద్వారా ప్రజలకు శుద్ధ తాగునీరు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ కాలనీలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, నాయకులు మూర్తి, ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, బావాజీ, సంఘమిత్ర కన్యాకుమారి పాల్గొన్నారు.

జనుములు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రైతు సోదరులకు 35 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి ఎరువుల విత్తనాలను పొందగలరని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చి రొట్టె ఎరువులు, జనుములు 50శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము 10 కేజీల బ్యాగ్‌కు రూ.420 నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కృష్ణ చైతన్య తెలిపారు. రైతులు ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహానాడుకు రూ.25 లక్షల విరాళం

వీరబల్లి : రాజమండ్రిలో జరుగుతున్న టిడిపి మహానాడుకు రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు రాజు విద్యాసంస్థ అధినేత జగన్మోహన్‌రాజు రూ.25 లక్షల విరాళాన్ని టిడిపి అధినేత నారా చంద్ర బాబును కలిసి అందించారు. టిడిపి పార్టీ ఫండ్‌గా అందజేసినందుకు ఈ సంద ర్భంగా చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రాజును శాలువాతో సత్కరించి, మొమెంటో బహుకరించారనితెలిపారు. పార్టీకి అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నావని ప్రశంసించారని అన్నారని తెలిపారు.

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రజాస్వామ్య పద్ధతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దశల వారి రిలే నిరాహార దీక్షల లో భాగంగా సోమవారం లక్కిరెడ్డిపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపిజిఇఎ లక్కిరెడ్డిపల్లి తాలూకా కార్యవర్గ సభ్యులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యక్రమం వర్గం ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలో గల ప్రతి జిల్లాలో ప్రతి తాలూకా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయ, కాంట్రాక్టు, కార్మిక, పెన్షనర్ల, సిపిఎస్ ఉద్యోగులు, గ్రామ,వార్డు సచివాలయ అన్ని సంఘాల మద్దతుతో ఉద్యోగులందరూ కలిసి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలు, అనేక సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రతి నెల ఒకటో తేదీని జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్, డిఎ బకాయిలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సొమ్ములకు భద్రత మొదలగు 9 ప్రధాన డిమాండ్లతో పాటు సుమారు 200 డిమాండ్లు నెరవేర్చుట కోసం ప్రభుత్వానికి గత నాలుగు సంవత్సరాలలో అనేక నివేదికలు సమర్పించడంతో పాటు పలుమార్లు చర్చల్లో కూడా విన్నవించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, ఎపిజిఇఎ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుధాకర్‌రాజు , జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డినాయక్ , రాయచోటి అధ్యక్షుడు సాయికుమార్, విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు పి.రాజా, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షుడు తిమ్మారెడ్డి, తాలుకా కార్యదర్శి దేవేంద్రారెడ్డి , అపాస్ నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కలకడ:** సిపిఎస్‌ను రద్దు పరిచి ఓపిఎస్‌ను అమలు చేయాలని మండల కేంద్రమైన కలకడలో ఎంప్లాయిస్ యూనియన్ సమస్యలపై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఉద్యోగుల దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎపిజిఇఎ సంఘు నాయకులు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనపురం పంచాయతీ పరిధిలోని పాలన్నా గారిపల్లి సమీపంలో ఉన్న మామిడి తోట ఆనుకొని ఉన్న వంకలో హిటాచీ, జెసిబిలతో టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను తోడి మామిడి తోటలో భారీగా నిల్వ ఉంచారు. నిల్వ ఉంచిన ఇసుకను అక్రమంగా భారీ వాహనాలు టిప్పర్ల ద్వారా రాత్రి సమయంలో సెలవు దినాల్లోనూ అక్రమంగా ఇసుకను బెంగళూరు, చెన్నై, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. జాతీయ రహదారికి 500 మీటర్లు దూరంలో మామిడి తోట ఉంది. అక్కడే ఇసుకను నిల్వ ఉంచి పెద్ద పెద్ద వాహనాలు, టిప్పర్లు, లారీలలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న అధికారులు రెవెన్యూ, పోలీసు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్యులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వ అధికారుల అనుమతి కావాలని, రాజకీయ నాయకులకు అనుమతి లేకుండా రాత్రికి రాత్రే అక్రమంగా రవాణా చేసుకున్న అధికారులు మాత్రం పట్టించుకోరని గ్రామాల ప్రజల ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకొని అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్‌లో తరలిస్తున్న ఇసుక

'ఉపాధి'.. కానరాని కనీస వసతులు

పని ప్రదేశంలో నిర్వహించని మస్టరు..లోపించిన పారదర్శకత

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వేసవిలో రోజూ 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. భగ్గుమనే ఎండల్లోనే ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్నారు. వారు వడదెబ్బతో విలవిల్లాడు తున్నారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కనీసం టెంట్లు, తాగడానికి నీటి వసతిని కూడా కల్పించడం లేదని కూలీలు మండిపడుతున్నారు. సోమవారం మండలంలోని బి.ఎర్రగుడి గ్రామం పరిధిలో నల్లగుట్టపల్లి, చెంచర్లపల్లి దళితవాడ కూలీలను సందర్శించగా మండే ఎండలకు పనిచేస్తున్నామని, ఉపాధి సిబ్బంది నీడకు టెంట్లు, తాగునీరు కల్పించడం లేదని అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్సకు ఎటువంటి మందులను అందుబాటులో ఉంచడం లేదని తెలిపారు. వేసవిలో వేసవి తాపానికి గురైనప్పుడు ఒఆర్ఎస్ అందించడం లేదని ఆవేదన చెందారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

నల్లగుట్టపల్లి చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

రైతులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దమండ్యం

రైతులను ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలా ఆదుకునేందుకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారాకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో వాటర్ షేడ్ పథకం ద్వారా రాయితీ పై మంజూరై న పరికరాలు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గత టిడిపి ప్రభుత్వం నియెజకావర్గ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని జగన్మోహన్‌రెడ్డి సిఎం అయిన తర్వాత నియెజకావర్గం అభివృద్ధి అంచలంచెలుగా అభివృద్ధి జరుగుతోందన్నారు. శివపురం నుంచి తంబళ్లపల్లికి త్వరలో రోడ్డు పనులు చేపట్టు తున్నట్లు ఆయన వెల్లడించారు. అనతరం డ్వామా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ 624 మంది రైతులకు రూ.1.63 కోట్లతో వివిధ రకాల పరికరాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ పీడీ లక్ష్మి నరసయ్య, ఎపిడి నందకుమార్ రెడ్డి, ఎంపిడి శ్రీధర్ రావు, ఎపిఒ మురళి, వాటర్ షేడ్ పిఒ రవీంద్రుడు, వక్ఫ్ బోర్డ్ వైఎస్ ప్రెసిడెంట్ రాసిదబెగం, ఎంపిపి పూర్ణచంద్రిక, రమేష్, జడ్‌పిటిసి పీరమ్మ దొరస్వామి, కృష్ణారెడ్డి, జెసి ఎస్ కన్వెనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథ్, బయ్యారెడ్డి, సరస్వతి, విజయకుమారి, పద్మావతి పాల్గొన్నారు.

ఎస్ఐ రాఘురాంకు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రఘురాంను రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, రాష్ట్ర ఎస్సి సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్యల కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ మండల ప్రజలతో మమేకమై అనేక సమస్యలను సకాలంలో పరిష్కరిస్తారని, ఎల్లప్పుడూ ప్రజలకు అందు బాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా పరిష్కారం చూపుతారని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమాన ధర్మం పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిగమాలరమేష్, సిగమాలరవి, పాల్గొన్నారు.

ఊర్లకు వెళ్లేవారు సమాచారమివ్వండి

ప్రజాశక్తి-నందలూరు

వేసవి సెలవులలో భాగంగా ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం అందజేస్తే ఇళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్ఐ చెన్నకేశవ అన్నారు. సోమవారం వాహన తనిఖీలులో భాగంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు,యువత ఈత సరదాలో భాగంగా కుంటలు, చెరువుల దగ్గరకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. స్విమ్మింగ్ పూల్స్ వెళితే మంచిది అని అన్నారు. నేటి యువత అధిక వేగం కారణంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వాహనదారులు సీట్ బెల్ట్ ,హెల్మెట్ ను తప్పక ధరించాలని అన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ ను తప్పనిసరిగా పాటించాలని అని అన్నారు. గ్రామస్థాయి ఉత్సవాలలో భాగంగా (జాతరలు) పోలీసుల అనుమతి తప్పనిసరి అని, డీజేకి ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని అన్నారు. క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఉంచడం జరిగిందని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండండి : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నిమ్మనపల్లి బహుదా ప్రాజెక్టు, చెరువులు, నీటి కుంటల వద్ద ప్రమాదాలపై పోలీసుల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం కావడం, పాఠశాలలకు సెలవులు ఉండటంతో చిన్నపిల్లలు, యుక్త వయసు వారు స్నేహితులతో కలిసి ఈతపై సరదాతో, చేపలు పట్టడం పై సరదాతో నీటి చెరువుల వద్దకు కుంటల వద్దకు వెళుతుంటారని అన్నారు. చెరువులలో, కుంటలలో నీటి లోతు అధికంగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండకపోతే అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కొత్తగా ఈత నేర్చుకునే వారి పట్ల తల్లిదండ్రులు దగ్గర ఉండి జాగ్రత్తలు తీసుకో వాల న్నారు. ఎటువంటి సమాచారం అయినా సకాలంలో నిర్భయంగా పోలీ సులకు తెలియ జేయాలని ప్రజలను కోరారు.

చెరువుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

వృద్ధులకు అన్నదానం

రాయచోటి : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నేషనల్ హైస్కూల్ అధినేత మహదేవపల్లి నరసింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారుడు లయన్ ఎం.అశోక్ రెడ్డి, కోడలు లయన్ ఎం.లావణ్య రెడ్డి ఆర్థిక సాయంతో బండపల్లి దగ్గర ఉండే ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసినట్లు అధ్యక్షులు లయన్ షేక్‌మహమ్మద్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. ఇప్పటివరకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 500 పైచిలుకు సేవ కార్యక్రమాలు పూర్తి చేశామని ఇందుకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పార్వతమ్మ, తనిష్క, నరసింహ తనీష్‌రెడ్డి, వినోద్ కుమార్‌నాయక్, ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ,అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో పట్టణంలోని మారుతీ సూపర్ మార్కెట్ యజమానులు నాగేంద్రప్రసాద్. శివకుమారి కుమార్తె విమలశాన్వి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మదనపల్లెలోని మారుతీ సూపర్ మార్కెట్ యజమానులు నాగేంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులు వెలుగు సంస్థకు విచ్చేసి ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమ ప్రాంగణం వీక్షించారు. అందరి సమక్షంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వెలుగు చిన్నారులకు, వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో నాగేంద్ర ప్రసాద్, శివకుమారి, విమలశాన్వి కుమారుడు అనిరుద్, వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనా కుమారి, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

కొడుకు కనిపించలేదని తండ్రి ఆవేదన

-పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న వైనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బీహార్ రాష్ట్రం నుంచి కూలి పనులకు వచ్చిన తండ్రి కొడులు.. వాల్మీకిపురం పట్టణం జెట్టిపాళ్యంవీధిలో గత ఆరు నెలలుగా బాడుగ ఇంట్లో ఉంటూ.. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. తండ్రి మహ్మద్ సహదత్.. కొడుకు ఎండి నూర్ అలాం మధ్య చిన్నపాటి మనస్పర్థలు రావడంతో కొడుకు నూర్ అలాంను తండ్రి మందలించాడు. దీంతో కొడుకు నూర్ అలాం ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. పది రోజులు అవుతున్నా తన కొడుకు ఇంటికి రాలేదని, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరు గుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మహ్మద్ సహదత్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొడుకు కనిపించక పోవడంతో బీహార్‌లోని తన తల్లి మంచం పట్టిందని, పోలీసులు స్పందించి తన కొడుకు ఆచూకి తెలపాలని తండ్రి మహ్మద్ సహదత్ కోరాడు.


నూర్‌అలాం (ఫైల్ ఫొటో)

ఎంపిపికి వినతి పత్రం అందిస్తున్న దేవులపల్లి గ్రామస్తులు

నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవులపల్లి పంచాయతీ దేవులపల్లి దళితవాడలో గత వారం రోజులుగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సోమవారం ఎంపిపి శ్రీదేవిరవికుమార్‌కు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎంపిపి హరిజనవాడ కాలనీకి ఏర్పాటు చేసిన స్కీం బోరుకు విద్యుత్ సౌకర్యం లేనందున నీటి సమస్య తలెత్తిం దని గుర్తించి వెంటనే ట్రాన్స్‌కో ఎడి శ్రీనివాస్, ఎఇ వరప్రసాద్‌తో మాట్లాడి గ్రామానికి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న నీటి సమస్య పరిష్కరించడంతో ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.

గాలివానకు నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని పలు గ్రామపంచాయతీలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. పెద్ద వృక్షాలు విరిగిపోయి రాకపోకలు స్తంభించి పోయాయి. మామిడి తోటలకు కాయలు రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. స్థానిక ఎన్‌టిఆర్ జూనియర్ కళాశాలలో రేకులు గాలికి ఎగిరి పోయా యి. కరెంటు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మామిడి తోటల్లో పెద్ద పెద్ద కొమ్మల విరిగి కాయలన్ని రాలిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

క్రైం కార్నర్

మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

అంతర్ జిల్లాల నిందితుడు అరెస్టు

రూ.9 లక్షలు విలువ చేసే బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తాళము వేసిన ఇళ్ళను రాత్రి, పగలు పూట కన్నము వేసి బంగారము, వెండి వస్తువులను దొంగలించిన అంతర జిల్లాల నిందితుడు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. సోమవారం స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ పట్టణంలోని గౌతమీనగర్, చీకులగుట్టకు చెందిన లేట్ కృష్ణ కుమారుడు కావడి సోమశేఖర్(26) పంది మాంసము అమ్ముకుంటు వలన జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి పట్టణంలో వరసగా చోరీలకు పాల్పడుతుండటంతో ఆర్. గంగాధర్ రావు ఆదేశాల మేరకు టూ టౌన్ సిఐ మురళీకృష్ణ ప్రత్యేక టీంల ద్వారా ఏర్పాటు చేసి వారికి రాబడిన సమాచారము పై ఎస్ఐ లోకేష్‌రెడ్డి , సిబ్బంది కలిసి ఆదివారం రాత్రి సుమారు స్థానిక చౌడేశ్వరి సర్కిల్ వద్ద వ్యక్తిని అదుపు లోకి తీసుకుని అతని వద్ద నున్న 79.2 గ్రాముల బంగారు ఆభరణాలు మొత్తము 156.7గ్రాముల బంగారం, దాని విలువ సుమారు రూ.9లక్షలు స్వాధీనము చేసుకొని బంగారమును దొంగతనము చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సోమశేఖర్ దొంగలించిన బంగారాన్ని మదనపల్లె టౌన్, రామారావు కాలనీకి చెందిన సాయికిరణ్, తన భార్య శేషాబాయి, శేషాబాయి చెల్లెలు దేవదానమ్మ పేర్లపై మదనపల్లె టౌన్ ముత్తూట్ ఫైనాన్సులో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులను సమానంగా పంచుకుంటారని తెలిపారు. ఇతనిపై మదనపల్లె, పీలేరు, వాయల్పాడు, పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న ఇళ్ళల్లో బంగారమును దొంగతనము చేయగా, ఇతని పైన 15 కేసులు నమోదు చేసి, ఆ కేసులలో జైలుకు పంపినట్లు తెలిపారు.

స్థల వివాదంలో ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నిమ్మనపల్లి రోడ్డు దిగువ కమ్మపల్లిలో స్థలం వివాద విషయంలో ఏర్పడిన ఘర్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మదనపల్లి టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో సోమవారం జరిగిన ఒక స్థల వివాదానికి సంబంధించి మదనపల్లి పట్టణం నిమ్మనపల్లి రోడ్డు దిగువ కమ్మపల్లిలో కాపురముంటున్న ఎం.మల్లయ్యనాయుడు కుమారుడు ఎం. లీలాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆదినారాయణ రెడ్డి, కొంత మంది అతని అనుచరులు లీలాసాగర్ ఇంటి ముందున్న అతని బంధువుల ఖాళీ స్థలంలో ఉన్నటువంటి గోడను బద్దలు కొట్టి రేకుల బంకును ఏర్పాటు చేయు చుండగా అదే సమయంలో లీలాసాగర్, అతని బంధువులు అడ్డుకోగా వారిని ఆదినారాయణరెడ్డి, అతని అనుచరులు గడ్డపార, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆదినారాయణరెడ్డి, దుర్గాప్రసాద్ సత్యనారాయణ, విజయ భాస్కర్, అమరేంద్ర వీరికి గతంలో సదరు భూమికి సంబంధించి గొడవలు జరిగాయని తెలిపారు. లీలాసాగర్ నాయుడు ఫిర్యాదు మేరకు ఆదినా రాయణరెడ్డి , అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలా దౌర్జన్యంగా ప్రవర్తించిన వారిపై రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తున్నామని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపనున్నామని సిఐ వివ రించారు. స్థలాల విషయంలో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన భూకబ్జాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. సమావేశంలో టూటౌన్ ఎస్, సిఐ.లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటో, స్కూటర్ ఢీ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు నుంచి నూలివీడుకు సోమవారం ఇనుప కడ్డీలు వేసుకొని ఆటో బయలుదేరి వెళుతుండగా కొర్లకుంట నుంచి ద్విచక్ర వాహనంలో తూముకుంట రమణ ఆదిలక్ష్మమ్మ ద్విచక్ర వాహనంలో గేటు పెట్రోల్ బంక్ సమీపం రావడంతో ద్విచక్ర వాహనం ఆటో ఢీకొనడం వలన తమ్మిశెట్టి రమణకు చేయి విరిగింది కాలు విరిగింది గాయాలు కావడంతో చిస్తా నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు ఇక ఆటో ద్విచక్ర వాహనాన్ని పోలీస్ స్టేషన్లో వుంచ్చినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకట శివ కుమార్ పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో డిస్కం ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలోని ములకలచెరువుకు చెందిన డిస్కం ఉద్యోగి మోహన్ కుమార్ (45) సోమవారం పెద్దపాళ్యం వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మృతుడు మదనపల్లిలో కాపురముంటూ రూరల్ మండలం వేంపల్లిలో విద్యుత్ లైన్మెన్ పని చేసేవారు. ఈ నేపథ్యంలో ములకలచెరువులో ఉన్న తన తల్లిని చూసి వస్తానని భార్య లలితకు చెప్పిన మోహన్‌కుమార్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. ములకలచెరువుకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపాళ్యం వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. సోమవారం ఉదయం అటు వైపు వెళ్ళే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.